ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023


5

విజయనగరం



కౌలుదారులందరికీ కార్డులు

విజయనగరం : జిల్లాలోని కౌలుదారులందరికీ కౌలు హక్కు కార్డులు జారీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విటి రామారావు తెలిపారు. సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'కౌలు రైతుకు కష్టం' శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 12,685 మంది కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేశామని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది కౌలు రైతులను గుర్తించినట్లు పేర్కొన్నారు. 2019కౌలు చట్టం ప్రకారం భూ యజమాని అంగీకారంతోనే కౌలు హక్కు కార్డులు జారీ చేయాలని, భూమిని కౌలుకు తీసుకున్న ప్రతి రైతును ఆర్‌బికెలో గ్రామ వ్యవసాయ సహాయకులు, విఆర్‌ఒ వద్దకు తీసుకెళ్లి కార్డులుజారీ చేశామని తెలిపారు. యజమాని అంగీకారం ఇవ్వకపోతే యజమాని పేరుమీదే ఈ పంట నమోదవుతుందని పేర్కొన్నారు. ఇంకా ఈ ప్రక్రియ కొనసాగుతుందని, ఎవరైనా ఉంటే కార్డులు పొందవచ్చునని తెలిపారు. ప్రతిరైతు తమపరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. కౌలు కార్డు ఉన్న ప్రతి రైతు బ్యాంకు రుణం పొందవచ్చునని తెలిపారు.



తహశీల్దార్‌కు వినతి అందజేసేందుకు వచ్చిన కుష్టురోగులు

కుష్టు రోగుల భూములపై ప్రభుత్వం కన్ను

- 4.71 ఎకరాలను స్వాధీనం చేసుకున్న అధికారులు
- సర్కారు తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-బొబ్బిలి


కుష్టు రోగుల భూములపై ప్రభుత్వం కన్ను పడింది. 1961లో కుష్టు రోగుల కోసం 12.60 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రభుత్వం కేటాయించిన కొంత భూమిలో ఇళ్లు నిర్మించుకుని ఆ కాలనీకి ప్రేమనగర్ కాలనీగా నామకరణం చేశారు. ప్రేమ సమాజం లెప్రసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. కుష్టు రోగులు పనులు చేసుకునే అవకాశం లేకపోవడంతో పట్టణంలో భిక్షాటన చేసుకుని ఆ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. ఖాళీగా ఉన్న 4.71 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయడంతో కుష్టు రోగులు, ప్రేమనగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐటిఐ కాలనీకి ఎదురుగా 12.60 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తే, కొంత భూమిలో కుష్టు రోగులు ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన భూమి ఇతర అవసరాలకు రిజర్వ్‌గా ఉంచారు. ప్రేమనగర్‌కాలనీ వద్ద మల్లమ్మపేట రెవెన్యూలో సర్వే నంబర్ 218-ఎలో 4.71 ఎకరాలు ఖాళీగా ఉంది. కొన్నేళ్లుగా ఆ భూమి ఖాళీగా ఉండడంతో బుడా ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రీయ రహదారి పక్కనే భూమి ఉండడంతో పెట్రోల్ బంకు ఏర్పాటుకు బుడా ప్రతిపాదనలు చేయడంతో కౌన్సిల్ తీర్మానం చేసేందుకు మున్సిపల్ సమావేశంలో అజెండా పెట్టారు. కానీ, ఆ వార్డు కౌన్సిలర్ తెంటు పార్వతి వ్యతిరేకించడంతో తీర్మానాన్ని ఆమోదించకుండా వాయిదా వేశారు. దీంతో ఖాళీగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలని అధికార పార్టీ నాయకులు రెవెన్యూ అధికారులకు సూచించారు. సర్వే చేసిన అధికారులు ఖాళీగా ఉన్న 4.71 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు అక్కడ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నాలుగేళ్లలోపు ఎటువంటి నిర్మాణాలూ చేయకపోతే వెనక్కి తీసుకునే హక్కు ఉండడంతో ఆ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు.

భూమి లాక్కోవడంపై ఆగ్రహం

1961లో ఇచ్చిన భూమిని ప్రభుత్వం లాక్కోవడంపై కుష్టు రోగులు, ప్రేమనగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్ణయంపై ప్రేమ సమాజం లెప్రసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సర్కార్ ప్రభావతి, కాలనీ వాసులు సీతమ్మ, పి.పైడమ్మ, అంజమ్మ, వై.రాములమ్మ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ భూములను భవిష్యత్తు అవసరాలకు ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. తమ భూములను తీసుకోవద్దని తహశీల్దార్ డోల రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. తమకు కేటాయించిన భూమిని అలాగే ఉంచాలని కోరారు.

మెట్టు దిగని గీత





- మాట నిలబెట్టుకోని అశోక్
- ఫలించని రాయబారం
- విజయనగరం టిడిపిలో రసవత్తర రాజకీయం

విజయనగరం నియోజకవర్గంలో టిడిపి రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అంతా కలిసి పనిచేద్దామంటూ మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు రాయబారం పంపిన అశోక్ అంతలోనే ప్లేటు ఫిరాయించారట. విషయం తెలుసుకున్న గీత మెట్టుదిగని పరిస్థితి నెలకొంది. అశోక్ కోటరీ నుంచి స్పష్టమైన వైఖరి తెలియజేస్తే తప్ప కలిసిపని చేద్దామనే రాజీధోరణ వద్దని గీత అనుయాయులు భీష్మించినట్టుగా తెలుస్తోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు మధ్య విభేదాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా అంతా బంగ్లా కనుసన్నల్లో మెలగాలన్న వైఖరి ఆమెకు నచ్చలేదు. ప్రజలకు సందేశమివ్వాలన్నా, మీడియాతో మాట్లాడాలన్నా టిడిపి జిల్లా కార్యాలయం ముసుగులో బంగ్లాకు వచ్చి తీరాలని అశోక్ మెలికపెట్టారు. ఇలా ఇద్దరూ ఒకరికొకరు దూరం కావడంతో పార్టీలో రెండు శిబిరాలు నడుస్తూ వచ్చాయి. చివరకు గీత నియోజకవర్గం పార్టీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలతోపాటు ఇతర కార్యకలాపాలు కూడా గీత తన అనుయాయులతోనే నడుపుతూ వస్తున్నారు. నియోజకవర్గంలో మెజార్టీగా వున్న కాపు సామాజికవర్గం నాయకులు ఎక్కువగా గీతతోనే నడుస్తున్నారు. అటు అశోక్ కూడా కొంతమంది నాయకులతో బంగ్లా కేంద్రంగా రాజకీయాలు నడుపుతున్నారు. ఇటీవల చంద్రబాబు జైలుకు వెళ్లాక పార్టీ చెక్కుచెదిరిపోకుండా రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే విజయనగరంలో కూడా గీతను కలుపుకుని వెళ్లాలంటూ రాష్ట్ర కేంద్రం నుంచి అశోక్‌కు ఆదేశాలు అందినట్టు సమాచారం. తప్పనిసరి పరిస్థితుల్లో పార్టీ పెద్దగా అంతా కలిసిపని చేద్దామంటూ గీతతో రాయభారానికి పార్టీ సీనియర్ నేత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మరో నాయకుడు కనకల మురళీమోహన్‌లను నాలుగు రోజుల క్రితమే పంపారు. వీరిద్దరూ గీత ఇంటికి వెళ్లి మరీ బంగ్లాకు ఆహ్వానించినట్టు సమాచారం. 'వేర్వేరుగా పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ప్రతిపక్షానికి లోకువైపోతాం. అందుకే ఇక నుంచి అంతా కలిసి పనిచేద్దాం, ఇదే విషయాన్ని అశోక్ కూడా తమరికి చెప్పమన్నారు' అంటూ గీతకు వివరించినట్టు తెలిసింది. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందిస్తునే తనను నమ్ముకుని పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలతో కూడా సంప్రదించాక, కలిసి పనిచేయడానికి తనకు ఇబ్బందులేవీ లేవని చెప్పినట్టు సమాచారం. రాయబారానికి వెళ్లిన నాయకులు వెనుదిరుగుతూ 'నియోజకవర్గపార్టీ బోర్డును కూడా తీసేయండి' అంటూ విన్నవించడంతో గీత ఒకింత డైలామాలో పడ్డారు. అది కూడా ఆలోచిద్దాం అంటూ నాయకులను సాగనంపిన మరుచటి రోజే గీత తన కేడర్‌తో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే రాయభారానికి పంపినట్టే పంపిన అశోక్ 'మనం ఎవరికీ అపాయింట్‌మెంట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు కదూ' అంటూ బంగ్లాలోని తనకేడర్‌తో చిట్‌చాట్ చేసినట్టుగా సమాచారం. ఇదే విషయం గీత కేడర్‌కు తెలియడంతో అశోక్ వైఖరిపై అగ్గిమీద గుగ్గిలమయ్యారట. బోర్డు తీసేయాలన్న షరతుపైన కూడా గీత గ్రూపు నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిలిచినట్టే పిలిచి ఇదేమి పితలాటం అంటూ సమావేశంలో మండిపడ్డారు. స్వతంత్రంగానే పార్టీకోసం పనిచేయాలని, స్పష్టమైన వైఖరి తెలుసుకోకుండా వెళ్తే మళ్లీ లోకువైపోతామని, ఇదే పరిస్థితి ఏర్పడితే బిసిలకు ముఖ్యంగా కాపు సామాజికవర్గానికి దూరం కావాల్సి వస్తుందని కేడర్ చర్చించినట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో గీతకు సీటు కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలన్నది ఆమె కేడర్ లోగుట్టుగా తెలుస్తోంది. అశోక్ ఈసారి పోటీ చేయడానికి కూడా సిద్ధంగా లేరంటూనే ఆయన కేడర్ ప్రచారం చేస్తోంది. అశోక్ మాత్రం తాను కాకపోతే బిసిల్లోనే వేరొక సామాజికవర్గానికి ప్రాధాన్యతనిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని పార్టీకి చెందిన కొంతమంది విశ్లేషిస్తున్నారు. ఈనేపథ్యంలో విజయనగరం నియోజకవర్గ టిడిపి అంతర్గత రాజకీయాలు ఆసక్తికరంగానూ, రసవత్తరంగానూ మారాయి.

జగనన్నకు చెబుదాంలో వినతుల వెల్లువ

ప్రజాశక్తి-విజయనగరంకోట



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. అర్జీదారులతో కలెక్టరేట్ ఆడిటోరియం కిటకిటలాడింది. మరోవైపు బయట ధర్నాలతో దద్దరిల్లింది. జామి తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని పాత భీమసింగి రెల్లివీధికి చెందిన పలువురు వినతినిచ్చారు. 30 ఏళ్లగా నివాసముంటున్న తమ కాలనీలో కాలువలు, వీధిలైట్లు లేవని, పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. కలెక్టర్‌కు పదే పదే చెబుతున్నామని తహశీల్దార్ తమను దుర్భాషలాడుతున్నారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో బాధితులు అప్పలకొండ మంగమ్మ, కోటమ్మ, రత్నాలు, రామయ్యమ్మ, పద్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మీ వల్ల కాదంటూ జనసేన నాయకులు లోకం మాధవి ధ్వజమెత్తారు. పలు సమస్యలపై ఫిర్యాదు ఇచ్చిన అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టులు, అరాచక పాలనతో ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్ప ఏమీ లేదన్నారు. జగనన్న సురక్ష అని కొత్త నాటకానికి తెర తీశారని, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు.

పూసపాటిరేగ మండలం కుమిలికి చెందిన పలువురు దళితులు ఫిర్యాదు చేస్తూ 1988లో 36 కుటుంబాలకు ప్రభుత్వం ఒక ఎకరా చొప్పున భూమి ఇచ్చిందని తెలిపారు. అయితే తాజా డిఆర్ ఫైల్ గురించి గ్రామ విఆర్‌ఒ ని అడిగితే తన వద్ద లేదంటున్నాడని, తమకు ఇప్పించాలని కోరారు.

దాసన్నపేట రూట్ 33 ఎండియుపై చర్యలు తీసుకోవాలని విజయనగరం మండల పట్టణ రేషన్ డిపో డీలర్ల సంఘం డిమాండ్ చేసింది. కార్యక్రమంలో రేషన్ డీలర్ల అధ్యక్షులు ఎఎస్ ప్రకాష్ ఉపాధ్యక్షులు తవ్వ మోహన్‌రావు, కార్యదర్శి టి.మోహన్‌రావు పాల్గొన్నారు.

పూసపాటి రేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన దుక్క రాంబాబు వినతినిస్తూ.. తాను కొప్పెర్ల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏడాదిపాటు వంట మాస్టర్ గా పని చేశానని, ఇటీవల తొలగించారని, తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరాడు.

గుంకలాం జగనన్న లేఅవుట్‌లో అవకతవకలు

విజయనగరం మండలం గుంకలాంజగనన్న లేఔట్ లో అక్రమాలు జరిగాయని, చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. 400 ఎకరాలు సేకరించి, అందులో కొంత ఇళ్లకు కేటాయిస్తే మిగతా ఖాళీ స్థలాలు ఎందుకు ఉంచారో చెప్పాలని కోరారు. వినతినిచ్చిన వారిలో టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగ రావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, కనకల మురళీమోహన్, ఎఎ రాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీదారుని ఇకెవైసి చేయించాలి

జిల్లాలో వివిధ వర్గాల ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను అర్జీదారులకు సంతృప్తి కలిగించే రీతిలో ఏవిధంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై అన్ని ప్రభుత్వ శాఖలు నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమకు అందిన అర్జీల్లో సంతృప్తికరంగా పరిష్కరించిన వినతుల సమాచారంతో ఈ నివేదికలు వారంలోగా ఇవ్వాలని చెప్పారు. దీనితోపాటు ఆయా మండలాల్లో సంతప్తికర వినతుల పరిష్కారంపై మండలాల ప్రత్యేక అధికారులు కూడా తమ మండలాలపై నివేదికలు అందించాలన్నారు. వినతుల పరిష్కారం సందర్భంగా అర్జీదారునితో ఇ-కెవైసి చేయించాలని స్పష్టంచేశారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత, డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, పద్మలత, సుదర్శన దొర తదితరులు వినతులు స్వీకరించి వాటి పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు 238 వినతులు అందాయి.

రైతు సమస్యలు పరిష్కరించాలని వినతి

విజయనగరం టౌన్ : రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ వినతి అందజేశారు. గత ఖరీఫ్‌లో రైతులు మిల్లులకు ధాన్యం తరలింపులో అదనపు డబ్బులు తీసుకొన్న మిల్లర్లపై 12 మంది రైతులు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు లేవని తెలిపారు. జిల్లాలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు భీమా చేసుకొనేదానికి ప్రభుత్వం పోర్టల్ నిలుపుదల చేసిందని, దాన్ని వెంటనే పునరుద్ధరించి ఆదుకోవాలని కోరారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కళాసీ ఛార్జీలు రైతుకు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఈ-కర్షక్ నమోదులో వాస్తవ సాగుదారులు గుర్తించడంలో లోపాలు వల్ల అనేకమంది రైతులు, కౌలురైతులు నష్ట పోతున్నందున వాటిని సరిచేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి దేవర జగన్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ విజేతగా నిలిచిన విజయనగరం బాలుర జట్టు

అండర్-17 వాలీబాల్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడప జిల్లాలో జరుగుతున్న అండర్ 17 వాలీబాల్ రాష్ట్ర ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయనగరం బాలురుజట్టు రాష్ట్ర విజేతగా నిలిచింది. సోమవారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తో జరిగిన మ్యాచ్‌లో 2.1 తేడా తో గెలిచి విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్టు క్రీడాకారులకు, కోచ్ కెవిఎఎన్ రాజు,(చిన్నారి), శివున్నాయుడులను డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

మరింత సమర్థవంతంగా జెఎఎస్

విజయనగరం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి ఒపి సంఖ్యను భారీగా పెంచాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. శిబిరాల నిర్వహణ తరువాత, అవసరమైన వారికి తదుపరి వైద్యం అందేటట్లు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. క్యాంపులు, వచ్చిన రోగులు, నిర్వహించిన టెస్టులు, ఇచ్చిన మందుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ మండల అధికారులు, ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రతి ఇంటినీ తప్పనిసరిగా సర్వే చేయాలని, ప్రతీ ఒక్కరి ఆరోగ్య వివరాలను తెలుసుకొని, యాప్‌లో నమోదు చెయ్యాలని కలెక్టర్ సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ బిపి, షుగర్, హెచ్‌బి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్ భవనాల నిర్మాణంపై సమీక్షించారు. నవంబర్ 15 లోగా తుది దశలో ఉన్న భవనాలను పూర్తిచేసి ప్రారంభించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 బాల బాలికల బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా సోమవారం జరిగాయి. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణం ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలను సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యం కలిగించడంతో పాటు మంచి భవిష్యత్ ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు బ్యాడ్మింటన్ ద్వారా ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. బాగా ఆడి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర పోటీల్లో సత్తా చాటాలని కోరారు. అనంతరం జరిగిన ఎంపిక పోటీల్లో ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఈనెల 29 నుంచి 31 తేదీ వరకు విజయవాడ లో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

11న హాకీ, త్రోబాల్ జిల్లా జట్లు ఎంపిక పోటీలు

ఈ నెల 11న స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో అండర్ 19 జిల్లా హాకీ, త్రో బాల్ జిల్లా బాల, బాలికలు జట్లు ఎంపిక జరుగుతుందని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్‌ఎన్ కృష్ణ తెలిపారు. అభ్యర్థులు తమ పుట్టిన తేది సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు పట్టుకొని ఆరోజు ఉదయం 9 గంటలకు క్రీడా మైదానానికి చేరుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు 13 మంది ఎంపిక

ఇటీవల పార్వతీపురం ఆర్‌సిఎం ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ క్రీడా పోటీలలో గంట్యాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 9 మంది బాలికలు, నలుగురు బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్లు పివిఎస్‌ఎన్ రాజు, బైరెడ్డి శ్రీనును హెచ్‌ఎం అలజంగి ఝాన్సీ అభినందించారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి -విజయనగరం కోట



బొబ్బిలిలో రిలే నిరాహార దీక్షా శిబిరంలో బాబుతో నేను పోస్టర్లను ప్రదర్శిస్తున్న బేబినాయన, టిడిపి కార్యకర్తలు

నేను సైతం బాబు కోసం అంటూ, చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం నాయకులు మెండ దాసునాయుడు ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షులు కూన రవికుమార్ , తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు వేమలి చైతన్య బాబు, ప్రధాన కార్యదర్శి గోలగాన సురేంద్ర , నియోజకవర్గాల అధ్యక్షులు గంటా రవి, శ్రీను రెడ్డి, పెడిరెడ్ల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయం వద్ద 27వ రోజు నిరసన దీక్షలో పలు డివిజన్ల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రొంగలి గలి రామారావు, చైతన్య బాబు, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : చంద్రబాబుని వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు డిమాండ్ చేశారు. సోమవారం టిడిపి నియోజకర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, నియోజక వర్గం సీనియర్ నాయకులు కంది చంద్ర శేఖర్ రావు ఆధ్వర్యంలో డెంకాడ టిడిపి నాయకులు నియోజక వర్గ కేంద్రంలో జరుగుతున్న సత్యేమేవ దీక్షల్లో పాల్గొని సంఘీ భావం తెలిపారు. జరజాపుపేటలో గుర్తించిన సిరిమాను చెట్టుకి టిడిపి నేతలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పల్లె భాస్కరరావు, కర్రోతు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పతి వాడ అప్పల నారాయణ, పోతల రాజప్పన్న, లెంక అప్పల నాయుడు, మహిళా నాయకులు చీకటి సుహాసిని, చిల్ల పద్మ, పాణి రాజు, పతివాడ విద్యా సాగర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న గొంప వెంకటరావు

వేపాడ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బానాది ఎంపిటిసి గొంప తులసి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ఆకుల డిపో వద్ద గొంప రమాదేవి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న హలాసనం వేసి నిరసన తెలిపారు.

బొబ్బిలి : పట్టణంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం కొనసాగాయి. ఈ దీక్షల్లో మండలంలోని కారాడ, రెడ్డియ్యవలస, గొంగాడవలస గ్రామాల కార్యకర్తలు కూర్చున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు, రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం : గత ఏడాది జూన్ 24న నమోదైన పోక్సో కేసులో శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం పెద్దసీది గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాద్ అలియాస్ రుషికుమార్‌కు 20ఏళ్ల జైలు, రూ. 20వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం మంగళవారం తీర్పు వెల్లడించిందని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. నిందితుడు ప్రసాద్ బాలికపై లైంగిక నేరానికి పాల్పడడంతో విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషనులో పోక్సో చట్టం యాక్టు ప్రకారం కేసును దిశ మహిళా పిఎస్ ఎస్‌ఐ కెటిఆర్ లక్ష్మి కేసు నమోదు చేసారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎసపి తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై సూచికలు

విజయనగరం : గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధిని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం 23 రకాల సూచికలు ఏర్పాటు చేసిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ప్రజా వినతుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా సాధించిన ప్రగతిని ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పశుసంవర్ధకశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ, పోలీస్, గ్రామీణ అభివద్ధి శాఖ, రెవెన్యూ, విద్య శాఖ, స్వయం సహాయక సంఘాలు, వైద్య ఆరోగ్య శాఖ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్ లైన్ లో పొందుపరచాలని సూచించారు. సిపిఒ పి. బాలాజీ అభివద్ధి సూచికలను గురించి వివరించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేత

విజయనగరం టౌన్ : 11 కెవి ఫీడర్‌ల మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ పూడిహరి ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు 11కెవి ఫీడర్స్‌పై మరమ్మతులతో పాటు విద్యుత్ లైన్లకు తగులుకున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఆగుతుందని తెలిపారు. తూర్పు బలిజివీధి, పుచ్చలవీధి, నల్లవీధి, ఆశపువీధి, ఫైర్ ఆఫీస్ ఏరియా, ఉల్లివీధి, మేదరవీధి, పాత బస్టాండ్ ప్రాంతం, కంటుభుక్తవీధి, సిటీబస్టాండ్, పి డబుల్ యు మార్కెట్, కోళ్ల బజార్, చేపల మార్కెట్, ఎంజి రోడ్డు, రామానాయుడు రోడ్, కన్యకాపరమేశ్వరీ కోవెల దగ్గర, మంగళవీధి, పెద్దవీధిలో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.


తీరప్రాంత గ్రామాల్లో సాగర్ కవచ్

ప్రజాశక్తి - భోగాపురం

తీరప్రాంతంలో మంగళవారం నుంచి రెండురోజులు పాటు సాగరకవచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి ఆర్. గోవిందరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం పోలీసు సిబ్బందితో ఆయన మాట్లాడారు. తీరం నుంచి వచ్చే ఉగ్రవాదులను ఏ విధంగా పట్టుకోవాలనే దానిలో భాగమే ఈ సాగర్ కవచ్ అన్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో నిర్వహించాలన్నారు. తీరం నుంచి వచ్చే వారిని కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సిఐ బి.వి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం 200 మంది సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఒక డిఎస్‌పి, ఇద్దరు సిఐలు, ఎనిమిది మంది ఎస్.ఐలు ఉంటారని వెల్లడించారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు

ప్రజాశక్తి-బాడంగి


ఎంపిటిసి పాలవలస గౌరు

మండలంలోని గజరాయునివలస సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపిటిసి పాలవలస గౌరుకు ఆహ్వానం అందలేదు. దీనిపై సోమవారం ఎంపిటిసి పాలవలస గౌరు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో అధికారులు రాజ్యాంగ నిబంధనల ప్రకారం కాకుండా, వైసిపి నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను ఎస్‌టి ఎంపిటిసిని కావడంతో అధికారులు అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

నకిలీ పట్టాలపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు.. విఆర్‌ఒలను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలపై ప్రజాశక్తిలో కథనం రావడంతో తహశీల్దార్ స్పందించారు. నకిలీ పట్టాలపై దర్యాప్తు చేసేందుకు విఆర్‌ఒలతో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా విఆర్‌ఒలతో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నకిలీ పట్టాలుంటే తయారు చేసిన వారిపైన, సహకరించిన రెవెన్యూ ఉద్యోగులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిటి గౌరీశంకర్, ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పెంట గ్రామానికి చెందిన రైతులు జి.త్రినాథ్, చింతల జగన్నాథం, జి.రమణమూర్తి, ఎన్.పురుషోత్తం, బి.అప్పలనాయుడు, బి.షణ్ముఖనాయుడు, చుక్క సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇసుక అక్రమ తవ్వకాలపై తహశీల్దార్ డోల రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి మండలం పెంట వద్ద వేగావతి నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి ట్రాక్టర్లతో తరలించడం వల్ల నదీ పరివాహక ప్రాంతం, సమీపంలో ఉన్న భూములు కోతకు గురవుతున్నాయని వారు తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సాగునీరు, తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు.

కరాటేలో కొత్తవలస క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-కొత్తవలస

పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గంటా కనకరావు మెమోరియల్ ఇన్విన్షనల్ సౌత్ ఇండియన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మండల క్రీడాకారులు సత్తాచాటారు. తొమ్మిది మంది పతకాలు సాధించినట్లు కోచ్ కర్రి సూర్య నూకరాజు తెలిపారు.

ప్రభుత్వ భూములను గుర్తించి నమోదు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువుల విస్తీర్ణం గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని తహశీల్దారు డి. ధర్మరాజు సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దారు ధర్మరాజు మాట్లాడుతూ విఆర్‌ఒలు రీసర్వేలో గుర్తించిన ప్రభుత్వ భుములు, చెరువు విస్తీర్ణం వివరాలు ఆయా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. భూహక్కు పత్రాలు పంపిణీ చేసి ఇకెవైసి జరిపించాలన్నారు. ఇప్పటికే శతశాతం భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. మిగతావి ఉంటే రీసర్వే చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశీల్దారు డి. శైలజ, ఆర్‌ఐ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

జనాభా విద్యపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక డైట్ కళాశాలలో విద్యార్థులకు జనాభా విద్య పై పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ ఎన్. తిరుపతినాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జనాభా విద్య అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో జానపద నృత్యం, నాటిక పోటీల ఈ నెల 11,12 తేదీల్లో డైట్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ఎంఇఒలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డైట్ లెక్చరర్లు పి. రవి కుమార్ ఫోన్ నంబర్ 7989350244, కె. సూర్యారావు ఫోన్ నంబర్ 8919985388 సంప్రదించాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పెరుమాలి గ్రామంలో మైనపల్లి పైడియ్య గుండెపోటుతో మరణించారు. సోమవారం ఆ కుటుంబానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, జగ్గరాజు పాల్గొన్నారు.

నేడు ఎల్.కోట మండల సమావేశం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.రూపేష్ తెలిపారు. ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులతోపాటు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

14 నుంచి గ్రంథాలయంలో పలు కార్యక్రమాలు

గరుగుబిల్లి : ఈనెల 14నుంచి దసరా సెలవులు సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్థానిక గ్రంథాలయ నిర్వహకులు నల్ల మధుసూధనరావు తెలిపారు. ఇప్పటికే గ్రంథాలయంలో చదవడంమాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అయితే ఈనెల 14నుంచి 24 వరకు దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీటెల్లింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రమాదకరంగా కలెక్టరేట్ పోర్టుకోలు

పెచ్చులూడుతున్నా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ ఉన్న పోర్టుకోలు ప్రమాదకరంగా మారాయి. పోర్టు కో నుంచి స్లాబ్ పెల్లలు ఎప్పుడు ఊడిపోయి ఎవరిమీద పడతాయోననే భయంతో ఉద్యోగులు, వాహన డ్రైవర్లు ఉన్నారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద, ఆబ్కారీ శాఖ వద్ద, ఖజానా శాఖ, జిల్లా విద్యా శాఖ కార్యాలయం, ఎపిజిఎల్‌ఐ కార్యాలయం వద్ద పోర్టికోలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కలెక్టర్, జెసి వెళ్ళే ప్రధాన మార్గం వద్ద ఉన్న పోర్టుకో కుడి వైపున స్లాబ్ పెచ్చులూడి వేలాడుతున్నాయి. దీంతో అక్కడ వాహనాలు ఉంచేందుకు, దాని కింద నుంచి వెళ్లేందుకు ఉద్యోగులు భయపడుతున్నారు. మరో వైపు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల వాహనాలు సరిగ్గా అక్కడే వచ్చి ఆగుతుంటాయి. ఎవరిపై ఎప్పుడు పెచ్చులూడి పడతాయోనని భయంతో వాహన డ్రైవర్లు ఉంటున్నారు. మరోవైపు ఆబ్కారీ శాఖకు వెళ్లే పోర్టుకో, ఖజానా శాఖ,ఎపిజి ఎల్ ఐ శాఖ వద్ద ఉన్న పోర్టు కోలు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉన్నాయి. వెంటనే జిల్లా యంత్రాంగం తగిన జాగ్రత్తలు ,చర్యలు తీసుకోపోతే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.



ఖజానా శాఖ వద్ద పెచ్చులూడుతున్న పోర్టుకో



జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ఇలా..


ప్రమాదకరంగా ఉన్న పోర్టుకో

విజయనగర్ బయోటెక్‌లో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు
- పరామర్శించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పూసపాటిరేగ, విజయనగరంటౌన్

పూసపాటిరేగ మండలం కొప్పెర్ల గ్రామంలో గల విజయ నగరం బయోటెక్ పరిశ్రమలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో చిన నడిపల్లి గ్రామానికి చెందిన బి.అప్పారావు (46), పెద నడిపల్లికి చెందిన ఇనకోటి హరి వెంకట కుమార్ (36) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే యాజ మాన్యం నగరంలోని తిరుమల-మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించింది. మొక్కజొన్న మెటీరియల్‌ను బయటకు తీస్తుండగా, వేడి పౌడర్ ఒక్కసారిగా చిమ్మడంతో కార్మికులపై పడి శరీరం కాలిపోయింది. ప్రస్తుతం వారు ఐసియులో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కార్మికులను పరామర్శించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. యాజమాన్యం మెరుగైన వైద్యం అందిం చాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నేడు భోగాపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక లెండి డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ చప్పా కిరణ్ తెలిపారు. ఈ జాబ్ మేళాలలో పేరున్న వివిధ కంపెనీలు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. 2017 నుండి 2023 లోపు డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాల్గొనవచ్చునని అన్నారు. ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. భోగాపురం మండలంతో పాటు, పూసపాటిరగే, భీమునిపట్నం తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

జెఎస్ శిబిరాలకు విశేష స్పందన


డెంకాడ.. మందులు అందజేస్తున్న తహశీల్దార్ ఆదిలక్ష్మి, సర్పంచ్ కనకరాజు

ప్రజాశక్తి-డెంకాడ

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని చొల్లంగిపేటలో 600 మందికి సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సచివాలయ పరిధిలో చొల్లంగిపేటతోపాటు మరో 8 మధుర గ్రామాలకు చెందిన ప్రజలు అత్యధికంగా పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి, చొల్లంగి పేట సర్పంచ్ కోరాడ కనకరాజు, ఢీకొల్లాం సర్పంచ్ అట్టాడ శివకృష్ణ, ఎంపిటిసి కిరణ్, నాయకులు చిట్టి రాజు, అప్పారావు, చిన్న, మోపాడ, డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారులు, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. దీనిపై పోలిపల్లి వైద్యధికారి తిరుపతి స్వామి మాట్లాడుతూ 354 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని అన్నారు. ఎంపిడిఒ ఎన్. అప్పలనాయుడు, తహశీల్దారు చింతాడ బంగార్రాజు, ఇఒపిఆర్‌డి సురేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కొమ్మూరి సుభోషణరావు, సచివాలయ కన్వీనర్ సుందర హరీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలోని గొట్లాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి మీసాల సరోజినీ ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, ఎంపిడిఒ వైవి రాజేంద్ర ప్రసాద్, సిఎస్ డిటి రవిశేఖర్, హౌసింగ్ ఎఇ బివి.రామరాజు, ఎంఇఒ అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ కర్రి యశోద ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వైద్యులు ఎ.ధరణి, సిహెచ్‌ఒ ఆంజనేయులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ పాల్గొన్నారు.


తెర్లాం.. శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తెర్లాం : మండలంలోని ఎంఆర్ అగ్రహారం సచివాలయ పరిధిలోని జగనన్న సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. వైద్య సేవ నిమిత్తం 300 మందికి పైగా హాజరయ్యారు. వైద్యులు కిరణ్, శ్రీనివాసరావు, మాధవి పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు, సర్పంచ్ రాంబాబు, రామకృష్ణ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు లవుడు లౌకిక, మద్దిల రంజిత్ రాష్ట్ర స్థాయి అండర్-19 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, పీడీ రమణ, సిబ్బంది అభినందించారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గిరిజన గ్రామాలు వీలుపర్తి, చినదుంగాడలో జ్వరాల విజృంభణ పై ప్రజాశక్తిలో సోమవారం కథనం రావడంతో అధికారులు స్పందించారు. హెల్త్ సూపర్‌వైజర్ వి.వి.రమణ ఆధ్వర్యాన ఆ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. రోగులకు పరీక్షలు చేసి, మందులు అందించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


చినదుంగాడలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ధర్నా చేస్తున్న పింఛనుదారులు

పింఛన్లు సకాలంలో చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు సకాలంలో పింఛన్లు చెల్లించాలని సోమవారం సబ్ ట్రెజరీ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదికి పెన్షన్ చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లచ్చుపతులు జగన్నాథం, బొబ్బిలి అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు పి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎటిఎం మనీ మోడల్‌తో నిరంతర ఆదాయం

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రకృతి వ్యవసాయంలో ఎటిఎం మనీ మోడల్ ద్వారా రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. సోమవారం బొండపల్లి గ్రామంలో ఆయన రైతులతో ముచ్చటించారు. బహుళ పంటలతో రైతులు అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మెంటర్ రొంగలి బంగారం, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి
యువకుడు మృతి

ప్రజాశక్తి-మెంటాడ


శివ (ఫైల్ ఫొటో)

మండలంలో లోతుగెడ్డ గ్రామానికి చెందిన బోను శివ(30) సోమవారం బస్సు నుంచి జారిపడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. లోతుగెడ్డకు చెందిన బోను కృష్ణ, కృష్ణమ్మ కుమారుడు బోను శివ. సోమవారం మధ్యాహ్నం వరకు స్నేహితులతో సరదాగా గడిపాడు. తన స్నేహితుడు బమ్మిడి సోములును బస్సు ఎక్కించి సాగనంపుతామని చెప్పి తానూ ఎక్కాడు. బస్సు రన్నింగులో దిగుతుండగా జారిపడి అక్కడికక్కడే మృత్యవాత పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆండ్ర ఎస్‌ఐ సిద్ధార్థ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని గజపతినగరం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కృష్ణకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రామునాయుడుకు వివాహం జరిగి వేరే కాపురం ఉంటున్నారు. చిన్న కుమారుడు శివ జెసిబి ఆపరేటర్‌గా పనిచేస్తూ వచ్చిన జీతంతో వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులు చూస్తుండేవాడు. మృత్యువు రూపంలో శివ దూరం కావడంతో వృద్ధ దంపతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

కాన్షీరాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - భోగాపురం

బహుజన సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ నియోజకవర్గం అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు అన్నారు. కాన్షీరామ్ 17వ వర్ధంతిని భోగాపురం గ్రామంలోని ఎస్‌సి, బిసి కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు మరువలేనవని అన్నారు. అహర్నిశలు శ్రమించి తన జీవితాన్ని పేదలకే అంకితం చేశారన్నారు. న్యాయవాది పచ్చిపాల గురునాథరావు మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న బహుజనులను పైకి తీసుకువచ్చిన వ్యక్తి కాన్షిరామ్ అని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాలులర్పించారు. ఆ పార్టీ నాయకులు దేబార్కి కృష్ణ, చందాల చిన్నారావు, మామిడి గోవింద, మైలపల్లి సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్సీరాం వర్ధంతిని కొత్తవలసలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాన్సీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఎస్‌పి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాకర శ్రీనివాసరావు, కొత్తవలస మండల అధ్యక్షులు బోని రాంబాబు, ప్రధాన కార్యదర్శి గుడితి శ్రీనివాసరావు పాల్గొన్నారు


కొత్తవలస.. కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బిఎస్‌పి నాయకులు

ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరించాలి


జనసేన నియోజకవర్గ కార్యవర్గ సభ్యులతో నాయకులు లోకం మాధవి

ప్రజాశక్తి - భోగాపురం

ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలకు వివరించాలని జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం మాధవి ఆ పార్టీ కార్యవర్గ సభ్యులకు సూచించారు. మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నియోజకవర్గం పరిధిలోని పార్టీ కార్యవర్గ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక దశలవారీగా మద్యం నిషేదం చేస్తానని చెప్పి మాట మార్చారని అన్నారు. విద్యుత్ చార్జీలను ఈ నాలుగేళ్ల కాలంలో ఎనిమిది సార్లు పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లిమర్ల అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే అనేక మందికి ఈ ప్రాంతంలో ఉపాధి దొరుకుతుందన్నారు. కాని ఇంకా శంకుస్థాపన దశలోనే ఉందన్నారు. ఇలాంటి విషయాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని ఆమె అన్నారు. తనకు ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తానని అన్నారు. ఈ ప్రాంతలో ఐటి కంపెనీలు, పార్కులు ఏర్పాటు చేసి హైదరాబాదుకు ధీటుగా ఐటిని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొప్ప లక్ష్య సాధనతో లీడ్ ఇండియా

ప్రజాశక్తి-విజయనగరం కోట

గొప్ప లక్ష్య సాధనతో చేస్తున్న కార్యక్రమమే లీడ్ ఇండియా అని డాక్టర్ ఎన్. బి. సుదర్శనాచార్య తెలిపారు . సోమవారం లీడ్ ఇండియా కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయ సాధన మేరకు లీడ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బి. సుదర్శనాచార్య సారథ్యంలో దేశానికి ఆదర్శ జిల్లాగా విజయనగరాన్ని ఎంపిక చేశారు. రోటరీ క్లబ్ సౌజన్యంతో మూడు రోజుల శిక్షణ శిబిరాలను నిర్వహించారు. లీడ్ ఇండియా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ వెంకటేశ్వరరావు , గౌరవ సలహాదారులుగా ప్రముఖ సంఘ సేవకులు ఆడిటర్ దుర్గా బాలాజీ నేతత్వంలో ఈనెల 11న నగరంలోని సుజాత కన్వెన్షన్ హాలులో 3వేల మంది విద్యార్థులకు మానవతా విలువలు, లక్ష్య సాధనకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. ఉమా బాలాజీ, సూర్యలక్ష్మి భోగరాజు, ఇ. విజయ్ కుమార్, చంద్రశేఖర్, శ్రీకాంత్ వర్మ, వి.ఆర్.కె.శర్మ తదితరులు పాల్గొన్నారు.


చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

చేగువేరాకు ఘన నివాళి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చే గువేరా వర్ధంతి సభను ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చెగువేరా చిత్రపటానికి పుష్పాలతో నివాళి ఘటించారు. కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కేశవరావు మాట్లాడుతూ సమాజంలో అంతరాలు పోగొట్టడానికి కృషి చేసిన పోరాట యోధుడు చేగువేరా అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు, ఎన్ఎస్ఎస్ పిఒ జి.ఈరన్న, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ వి.సుధీర్, అధ్యాపకులు రేచర్ల శ్రీలక్ష్మి, వి.స్వామి నాయుడు, పి.భాస్కర్‌రావు, సురేష్, ప్రసాద్, అప్పలరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.